నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 23 జూన్ 2024 | SIDDIPET

కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగే..

రాయపోల్, జూన్ 22: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా జరిగింది. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించారు. కాంగ్రెస్ పాలనలో సరిగా రాక అందరూ పడరానిపట్లు పడుతున్నారు. కేసీఆర్ నాయకత్వంతో తెలంగాణలో రెప్పపాటు విద్యుత్ పోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంట్ కోతలు విధిస్తూ పాత రోజులను గుర్తుకు తెస్తుంది. ప్రజలను మాయ మాటలతో మోసం చేసి గెలిసిన రేవంత్ సర్కారు ప్రజలకు సమాధానం చెప్పాలి. రైతులకు నిరంతరం కరెంట్ ఇచ్చి ఆదుకోవాలి.

– వెంకటనర్సింహారెడ్డి అంకిరెడ్డిపల్లి, వీరనగర్ సర్పంచ్, రాయపోల్ మండలం

మళ్ల పాత రోజులే...

రామాయంపేట, జూన్ 22: పదేండ్ల కంటే ముందు ఇప్పట్లక్కనే కరెంటు పోతుండే. మళ్ల అప్పటి రోజులు గుర్తుకు వస్తున్నయి. అప్పుడైతే కరెంటు కోసం పడరాని పాట్లు పడ్డాం. కేసీఆర్ సార్ అచ్చినంక కరెంటు కష్టాలు పోయినయి. మళ్లీ మొదలైయి. గప్పట్లో కాంగ్రెస్ ఉన్నప్పుడే కష్టాలు ఉండే. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ వచ్చింది కష్టాలు వచ్చినయి. పొద్దంతా టైలర్ పనులు చేసుకుందామంటే సరిగ్గా కరెంటు లేక ఉబ్బరానికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నం. మేము కష్టం చేసుకుంటే బతికెటోళ్లం. కాంగ్రెస్ నాయకులు కరెంటు మంచిగిచ్చి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలే.

– మద్దెల వాణి, టైలర్, రామాయం పేట

కోతలు లేని కరెంట్ అందించిన కేసీఆర్

రామాయంపేట, జూన్ 22: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సార్ కోతలు లేని కరెంట్ అందించారు. మేము కరెంట్ కోసం పనులు ఆపుకోవాల్సిన పని లేకుండే. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ రాలేదు. అప్పుడు చేతి నిండా పనులు చేసుకున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంత అధ్వానంగా కరెంట్ ఉంటదనుకోలేదు. ఎప్పుడు కరెంటు వస్తదో...ఎప్పుడు పోతదో తెలియడం లేదు.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు మాకు కరెంటు ఇబ్బందులు లేకుండే. ఇక తలంగాణలో కరెంట్ కష్టాలు ఉండవనుకున్న మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టాలు మొదలై, పాత భయానక రోజులను గుర్తుకు తెస్తున్నాయి.

– గుండ్ల నర్సింహులు, వైండింగ్ వర్క్‌షాప్, రామాయంపేట

సక్కగ రాని కరెంట్‌తో కష్టాలు పడుతున్నాం

మిరుదొడ్డి, జూన్ 22 : పదేండ్ల కాలం బీఆర్ఎస్ ప్రభుత్వంలో పడని కరెంట్ కష్టాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాంగనే పడుతున్నాం. కేసీఆర్ సార్ దయతో ఏ కష్టం లేకుండా మంచిగా పంటలు పండించుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చి ఆరునెలలు అయినప్పటికీ కరెంట్ సక్కగా లేక ఇంటి కాడ ఉక్కపోత, బాయికాడ పొలాలు ఎండిపోయినయి. కేసీఆర్ సార్ 24 గంటలపాటు కరెంట్ ఇచ్చిన మంచిగా చూసుకుండు. గప్పట్లో కాంగ్రెస్ ఉన్నప్పుడే కష్టాలు ఉండే. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ వచ్చింది కష్టాలు వచ్చినయి. సార్‌కు దండం పెట్టాలే. కరెంటు సక్కగా అచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సార్ చూడాలే. రైతులు బాగుంటే, అందరూ బాగుంటరు.

– మద్దెల సంతోశ్, రైతు, మిరుదొడ్డి

కాంగ్రెస్ పాలనలో కరువు చూడాల్సిందేనా?

కాంగ్రెస్ పాలనలో ప్రజలు కరువు చూడాల్సిందేనా... బీఆర్ఎస్ హయాంలో వచ్చిన నిరంతర కరెంట్ ఇప్పుడు ఉండడం లేదు. పరిశ్రమలకు మధ్య మధ్యలో విద్యుత్ కట్‌లు చూస్తున్నాయి. కర్షకులకు, కార్మికులకు తిరిగి కష్టాలు వస్తున్నట్లే కనిపిస్తున్నాయి. ఎవ్వసం చేయడానికి కర్షకులు వెనుకడుగు వేస్తున్నారు. కంపనీల్లో పని చేసే కార్మికులకు, పారిశ్రామికవేత్తలకు కరెంట్ పోతే నష్టాల్లోకి పోవల్సిందే. అటు రైతులు, ఇటు కార్మికులకు కరంట్ కష్టాలు వస్తే రాష్ట్రమే కరువుకోరలో చిక్కుకుపోతుంది. ఇకనైనా రాష్ట్ర పాలకులు మేల్కోవాలి. అందరినీ ఆదుకోవాలి.

– చిన్నపాపని కుమార్‌గౌడ్, జడ్పీటీసీ, గుమ్మడిదల మండలం

నాణ్యమైన కరెంటు ఇచ్చిండ్రు

రామాయంపేట, జూన్ 22: కేసీఆర్ సార్ నాణ్యమైన కరెంటు ఇచ్చిండ్రు. నిరంతర విద్యుత్ సరఫరాతో పనులు ఆగకుండా చేసుకున్నాం. మాకు ఆర్డర్ల మీద వచ్చే ఇనుప రాడ్లను కటింగ్ చేశాం. మిషన్‌లో వివిధ సైజుల్లో ఇనుప రాడ్లను కటింగ్ చేసి సమయానికి కస్టమర్లకు ఇచ్చేటోళ్లం. మాకు ఒక్క రామాయంపేటనే గాకుండా చుట్టుపక్కల పల్లెల నుంచి కస్టమర్లు వచ్చేవారు. ప్రస్తుతం కరెంటు సక్కగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు వస్తున్న కరెంటు 2014 సంవత్సర పరిస్థితులను గుర్తుకు తెస్తున్నది. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే, ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడూ అదే పరిస్థితి దాపురించింది.

– రామారపు వెంకటేశ్, లేట్‌మిషన్ ఆపరేటర్, రామాయంపేట

డీసీసీబీ పరిధిలో రూ.451 కోట్ల రుణమాఫీ

ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న డీసీసబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

సంగారెడ్డి, జూన్ 22 : ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో డీసీసీబీ పరిధిలో రూ.451 కోట్ల పంట రుణాలు మాఫీ కానున్నాయని చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం సంగారెడ్డిలోని డీసీసీబీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పంట రుణమాఫీకి సంబంధించి కటాఫ్ తేదీలను ప్రభుత్వం ప్రకటించి రైతులకు మరో శుభవార్త చెప్పిందన్నారు. 12 డిసెంబర్ 2018 నుంచి 31 డిసెంబర్ 2023 వరకు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. డీసీసీబీ బ్యాంకులో రూ.451కోట్ల రుణాలు మాఫీ అవుతాయని, తిరిగి ఆ మొత్తం రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండెకరాలు కలిగిన రైతులకు ఇండ్ల నిర్మాణానికి రూ.15 లక్షల రుణం ఇస్తున్నామన్నారు. మండల కేంద్రాల్లో రూ.40లక్షలు, పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు కట్టుకునే వారికి రూ.75లక్షల వరకు రుణాలు ఇస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు, టర్మ్ లోన్‌లు, వాహనాలకు రుణాలు, వ్యాపార రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డైరెక్టర్లు రమేశ్, వెంకట్రామ్‌లు, చంద్రయ్యస్వామి, పద్మ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

హుస్నాబాద్ టౌన్, జూన్ 22: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీలో 113 మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జనం నిద్రలేవక ముందే పట్టణాన్ని శుభ్రంగా ఉంచే మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితోపాటు పలు విభాగాలకు చెందిన కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. 113 మంది పారిశుధ్య, విద్యుత్, మంచినీటి సరఫరాతో పాటు వాహనాల డ్రైవర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతినెలా దాదాపు రూ.18 లక్షలు వేతనాల రూపంలో చెల్లిస్తున్నారు. మున్సిపాలిటికి వస్తున్న అంగడి ఆదాయం, నల్లా, ఇంటి అనుమతులు, వ్యాపార లైసెన్సుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని సిబ్బందికి వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ ఫండ్‌లో సరిపడా ఆదాయం లేకపోతే పట్టణ ప్రగతికి చెందిన నిధులను సైతం సిబ్బంది వేతనాలకు అందించి మళ్లీ జమ చేసేవారు. ప్రస్తుతం వేతనాలు రాకపోవడంతో సిబ్బంది అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టణ ప్రగతి నిధులు ఆపడంతోపాటు ఆశించిన పన్ను వసూళ్లు కాకపోవడంతో సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించలేకపోతున్నారు. ఈ విషయంపై కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అమాత్యులారా..జాడెక్కడ!

- పట్టి పీడిస్తున్న సమస్యలు
- ఎన్నికల హామీలు అమలేవీ..
- యాక్షన్ పాన్లు లేవు.. రివ్యూలు లేవు..
- సొంత నియోజవకర్గాలు తప్పా జిల్లా సమస్యలు పట్టించుకోని మంత్రులు
- ఆరు నెలలవుతున్నా గాడిలో పడని పాలన
- అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

సిద్దిపేట, జూన్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి):కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడుస్తున్నా జిల్లా సమగ్రాభివృద్ధి ప్రణాళిక, కార్యాచరణ ఇప్పటి వరకు సిద్ధం చేయలేదు. జిల్లాలో పాలన కొనసాగుతున్నదా..? లేదా ..? అనే సందేహాలు ప్రజలకు కలుగుతున్నాయి. మంత్రులు జిల్లాకు రావడానికి ముఖం చాటేస్తున్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ఇద్దరు మంత్రులు తమ నియోజకవర్గాలు అందోల్, హుస్నాబాద్ తప్పించి మిగతా నియోజకవర్గాల్లో పర్యటించడం లేదు. జిల్లా సమస్యలపై స్పందించడం లేదు. కనీసం కలెక్టరేట్లలో రివ్యూలు కూడా నిర్వహించడం లేదు. ఇక ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నారు. ముగ్గురు మంత్రులు జిల్లాకు ఉన్నప్పటికీ జిల్లా ప్రగతిపై దృష్టిసారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సొంతం నియోజకవర్గం అందోల్‌పాటు ఇతర ప్రాంతాల్లో ఎప్పుడో ఒకసారి పర్యటిస్తూ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతేతప్పా జిల్లాలో క్రియాశీలంగా వ్యవహరిస్తడం లేదనే విమర్శలు ఉన్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ ఏనాడు జిల్లా అభివృద్ధి గురించి రివ్యూలు నిర్వహించిన సందర్భాలు లేవు. ఆయన రాష్ట్ర రాజధాని నుంచి నేరుగా హుస్నాబాద్, కరీంనగర్‌కు వెళ్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క సమావేశం జిల్లాలో ఏర్పాటు చేయలేదు. ఆయన ఎంతసేపు కరీంనగర్ గురించి మాత్రమే ఆలోచన చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఈ జిల్లా అభివృద్ధి గురించి ఆలోచన చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. హుస్నాబాద్‌లో కూడా అందుబాటులో ఉండడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పేరుకే మా నియోజకవర్గానికి మంత్రి కాని ఆయన ధ్యాసంతా కరీంనగర్ పైనే ఉందని హుస్నాబాద్ వాసులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఒకే ఒక్కసారి ప్రజాపాలనపై రివ్యూ నిర్వహించారు. మంత్రులు ఉన్నా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందని మెతుకు సీమ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

సిద్దిపేట పట్టణం నుంచి కృష్ణసాగర్ వెళ్లే రహదారి పక్కన, దుబ్బాక పట్టణ శివారులో పేరుకుపోయిన చెత్త

గాడితప్పిన పాలన

సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహించడం, ప్రభుత్వ పాలసీలు, పథకాలు, కార్యక్రమాలు అమలు చేయాల్సిన మంత్రులు ముఖం చాటేయడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పాలన గాడి తప్పింది. అకాల వర్షాల కారణంగా యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయినా కనీసం రైతులను ఈ ప్రభుత్వం ఓదార్చలేదు. తడిసిన ధాన్యం కొనడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. జిల్లాలో ధాన్యం డబ్బులు రూ.60 కోట్లకు బకాయిలుగా ఉన్నాయి. ఈ డబ్బులు రైతులకు త్వరగా ఇప్పించడానికి మంత్రులు చొరవ చూపడం లేదు. రైస్‌మిల్లర్లు, అధికార యంత్రాంగం కుమ్మక్కై రైతులను నిలువునా దోపిడి చేసినా చర్యలు తీసుకోలేదు. పాఠశాలలు పునః ప్రారంభమైనా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. చాలాచోట్ల బుక్స్, యూనిఫామ్ ఇప్పటికీ విద్యార్థులకు అందలేదు. రైతుభరోసాపై ఊసే లేదు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వాటిని అరికట్టడానికి మంత్రులు యంత్రాంగానికి ఎలాంటి దిశానిర్దేశం చేయడం లేదు. ఏటా వ్యవసాయ పనులు ప్రారంభం కాగానే జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు. రైతులతో సమావేశాలు నిర్వహించి చర్చించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వర్షాకాలం ప్రారంభమైనందును సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తదితర అంశాలపై రివ్యూలు నిర్వహించడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో పంచాయతీ కార్యదర్శులు చేతి నుంచి డబ్బులు ఖర్చుచేస్తూ పాలన సాగిస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుత్ సిబ్బంది ఎక్కడి కక్కడ చెట్లను నరికి వేస్తున్నారు. నర్సరీలు ఎండిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రధానంగా తాగు, సాగునీరు, కరెంట్ సమస్యలపై కార్యాచరణ రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత మంత్రులపై ఉంది. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. మత్తు పదార్థాలతో యువత చిత్తవుతున్నారు. ఇసుక మాఫియా పేట్రేగిపోతున్నది. వీటన్నింటిని నియంత్రించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. వాటి అమలు అంతం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటనలు చేస్తూ, సమీక్షలు నిర్వహిస్తూ, కఠినంగా వ్యవహరిస్తే పాలన గాడిన పడే అవకాశం ఉంది.

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ

రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 22: రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్ మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకమొత్తంలో రుణమాఫీ చేయడం కోసం మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదన్నారు. త్వరలోనే విధి విధానాలు రూపొందించి జీవో విడుదల చేస్తామని చెప్పారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో రూ.165 కోట్లతో పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందులో ప్రాధాన్యతావారీగా అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ తదితర పనులు నిర్వహిస్తామని చెప్పారు. పట్టణాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసే బాధ్యతను ఓ సంస్థకు అప్పగించామన్నారు. పట్టణంలో జరుగుతున్న హైవే పనుల నిర్వహణకు ప్రజలు సహకరించాలన్నారు. హైవే అధికారులతో సమీక్ష నిర్వహించామని, నష్టపోయిన వారికి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఈనెల 24న జరుగనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ వైర్ పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు బోజు రమ, సుప్రజ, గోవిందు రవి, కొంకటి నళినీదేవి, చిత్తారి పద్మ, వల్లపు రాజు, లావణ్యసది, దొడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏరువాక సందడి

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం సంగారెడ్డి, కంది మండలాల్లో ఎడ్లకు ఘనంగా పూజలు చేశారు. కాశీపూర్‌లో రైతులు సంబురాలు చేసుకున్నారు. పశువులను అందంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామాల్లో ఎండ్లబండ్లను ఊరేగించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

కాంగ్రెస్‌వి కక్షపూరిత రాజకీయాలు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అమెరికాలోని మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జూన్ 22: తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. అమెరికాలో పర్యటిస్తున్న ఆయన వర్జీనియాలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని ప్రస్తుత పరిస్థితులపై ఆయన ప్రకటన విడుదల చేశారు. తాను బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని, సీఎం రేవంత్‌రెడ్డికి ఈ విషయం తెలుసునని పేర్కొన్నారు. ఉద్యమం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, ఉద్యమంలో అరెస్టు అయ్యానని పార్టీలు మారనన్నారు. రాజకీయాల్లో విలువలు పాటించాలని, గెలిచిన పార్టీలో ఐదేండ్లు ఉండాలన్నారు. పార్టీ మారాలని తనపై ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నదని, కేసులకు భయపడేది లేదన్నారు. ఆరు నెలల్లో నాలుగైదు కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. విచారణ పేరుతో కమిటీలు వేశారని, తనతో పాటు భార్య నీలిమ, కొడుకు అనురాగ్‌పై కేసులు పెట్టారన్నారు. కేసులకు భయపడనని, ధైర్యంగా పోరాడతానని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లోకి రాకముందు జేఏసీతో కలిసి తెలంగాణ కోసం పని చేశానని, అప్పుడు కేసులు నమోదయ్యాయని, మళ్లీ ఇప్పుడు పెడుతున్నారన్నారు. అబద్ధాలు చెప్పి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కేసీఆర్‌కు శ్వాస, ధ్యాస తెలంగాణే అన్నారు. తెలంగాణ ప్రపంచంలో తలెత్తుకుని నిలబడేలా కేసీఆర్ చేశారన్నారు. అమెరికా నుంచి అనేక విషయాలు మనం నేర్చుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

యూనిఫామ్ అందేనా..!

- ఒకే జత యూనిఫామ్ సిద్ధం
- రెండో జతకు ఆలస్యంగా వచ్చిన క్లాత్
- సంగారెడ్డి జిల్లాలో 85వేల మంది విద్యార్థులు
- ఈసారి మహిళా సంఘాలతో యూనిఫామ్ తయారీ
- ఒక జతకు రూ.75ల చొప్పున కుట్టేందుకు చెల్లింపు
- రెండో జత యూనిఫామ్‌కు తప్పని ఎదురుచూపులు

మహిళలు తయారు చేసిన యూనిఫామ్స్‌తో అదనపు పీడీ జంగారెడ్డి(ఫైల్)

సంగారెడ్డి, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్‌ను బడుల ప్రారంభం నాటికి అందించాల్సి ఉంది. బీఆర్ఎస్ హయాంలో అలాగే అందించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో సంగారెడ్డిలో జిల్లాలో ఈసారి కేవలం జత స్కూల్ యూనిఫామ్ మాత్రమే సిద్ధమయ్యాయి. సిద్ధమైన యూనిఫామ్స్ బడులకు పంపించారు. వాటి పంపిణీ ప్రస్తుతం జరుగుతున్నది. సంగారెడ్డి జిల్లాలో 1070 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీరి కోసం ఒక జతకు 2,48,442.63 మీటర్ల క్లాత్ జిల్లాకు రావడంతో అధికారులు మహిళా సంఘాల సభ్యులతో యూనిఫామ్స్ కుట్టించారు. ఇటీవల రెండో జతకు సంబంధించి క్లాత్ రావడంతో యూనిఫామ్‌లు తయారు కాలేదు. త్వరలోనే విద్యార్థులకు రెండో జతను అందిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.జత యూనిఫామ్ కుట్టేందుకు రూ.75 చొప్పున మహిళా సంఘాల సభ్యులకు డీఆర్‌డీవో అధికారులు డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ డబ్బులు వారికి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని తెలిసింది. గత బుధవారం న్యాల్‌కల్ మండలంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. కేవలం ఒకే జత యూనిఫామ్‌తో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూల్ ముగిసిన తర్వాత ఆ యూనిఫామ్‌ను మళ్లీ ఉతికి మరునాడు ధరించి స్కూల్‌కు వస్తున్నారు.

గతంలో ఏజెన్సీలతో తయారీ..

బీఆర్ఎస్ హయాంలో జిల్లాకు ఒక ఏజెన్సీతో పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ ముందే కుట్టించే బడుల ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో అందించారు. ఒకేసారి ఒక ఏజెన్సీ యూనిఫామ్స్ తయారు చేయడం సాధ్యం కాదనే ఉద్దేశంతో మండలాల వారీగా సబ్ ఏజెన్సీలతో కుట్టించి సకాలంలో అందించారు. ఈసారి విద్యార్థుల యూనిఫామ్‌ల తయారీకి ప్రభుత్వం నుంచి క్లాత్(బట్ట) రావడం ఆలస్యం కావడం, మహిళా సంఘాల సభ్యులతో కుట్టించడంతో జాప్యం జరిగిందని అధికారుల తెలిపారు. ఒక జతకు రూ.75 చొప్పున కుట్టు కూలి ఇస్తుండడంతో వారికి గిట్టుబాటు కాక కొంత ఆలస్యం జరిగినట్లు సమాచారం. వచ్చే నెలలో విద్యార్థులకు రెండో జత ఇచ్చే అవకాశం ఉంది.

రెండో జత యూనిఫాంకు బట్ట రావాలి

జిల్లాలో 1070 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 85వేలకు పైగా విద్యార్థులు ఒకే జత యూనిఫామ్‌కు సరిపడా ప్రభుత్వం నుంచి క్లాత్ వచ్చింది. దీంతో బడుల ప్రారంభం నాటికి విద్యార్థికి ఒక జత యూనిఫాం అందించేందుకు కుట్టించాం. జిల్లాలో 76 మహిళా సంఘాల సభ్యులతో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో యూనిఫాం కుట్టే కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఒక్కో కేంద్రంలో సుమారు 15 మంది మహిళల వరకు కుడుతున్నారు. రెండో జతకు క్లాత్ రాగానే జిల్లాలోని వంద వసతిగృహాలు, కేజీబీవీ విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు పంపిణీ చేస్తాం.

– జంగారెడ్డి, డీఆర్‌డీవో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, సంగారెడ్డి

పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలి

అధికారుల సమీక్షలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జూన్ 22: బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పెండింగ్ పనులను వేగంగా పూర్తిచేయాలని, ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టే నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. శనివారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పట్టణంలో ముంపునకు గురయ్యే నారాయణరెడ్డి కాలనీ వరద రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దూదిబాయ్, మాసానికుంట చెరువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, ఇక్కడి నుంచి వరద కాలనీలు ముంచెత్తకుండా చూడాలన్నారు. సింగూరు కుడి కాలువను సదాశివపేట మండలంలోని పెద్దాపూర్ వరకు పొడిగించి సాగునీరు అందించాలన్నారు. నియోజకవర్గంలోని చెక్‌డ్యామ్‌లు, గంగకత్వ లైనింగ్ పనులు, నక్కవాగుపై చెక్‌డ్యామ్‌లు, మల్కాపూర్ పెద్ద చెరువు మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఫసల్వాది మంజీరా బ్రిడ్జి వద్ద చెక్‌డ్యాం నిర్మాణం పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి బసవేశ్వర విగ్రహం వరకు నాలుగులేన్ల రోడ్డు పనులు, రాజంపేట రోడ్డు పనుల పురోగతిపై ఆరాతీశారు. సమావేవంలో కొండల్‌రెడ్డి, గో